ఎలక్ట్రీషియన్లకు టూల్ కిట్స్ అందజేత



టూల్ కిట్స్ అందజేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: మున్సిపల్ కార్మికులు తమ విధులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ సూచించారు. 'స్వచ్ఛతా హీ సేవా' 2024 కార్యక్రమంలో భాగంగా స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత అనే థీమ్‌తో శనివారం ఎలక్ట్రీషియన్స్‌కి టూల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ వారికి ఎల్లవేళల అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, పర్యావరణ ఇంజనీర్ శ్రావణ్, ఎలక్ట్రీషియన్ రాజేష్, వేణు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి



శంషాబాద్ రూరల్: పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్కారంలో శనివారం సామూహిక అన్నప్రాసనం చేయించారు. వివిధ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తయారు చేసిన పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. స్థానికంగా లభించే తాజా కూరగాయలు, పండ్లలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని సీడీపీఓ శాంతి సూచించారు. చిరుధాన్యాలు, పప్పు దినుసులను విరివిగా తీసుకోవాలన్నారు. మహిళలు, గర్భిణీలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య కోర్సుల ప్రవేశాల గడువు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) 2024–25 విద్యాసంవత్సరం అకడమిక్ సెషన్ కోసం ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సుల అడ్మిషన్ల దరఖాస్తు గడువును పొడిగించినట్లు సీడీఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ రజావుల్లాఖాన్ శనివారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నవంబర్ 10వ తేదీ వరకు అడ్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు నవంబర్ 14వ తేదీ ఆఖరు అని తెలిపారు. ఈ ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం అడ్మిషన్ పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు. మరిన్ని వివరాలకు.. స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ (ఎస్ఎస్‌యూ) హెల్ప్‌లైన్‌లు ఫోన్ నంబర్ 040–23008463 లేదా 040–23120600 (ఎక్స్‌టెన్షన్ నంబర్ 2207, 2208)లలో సంప్రదించాలని సూచించారు.



'స్వచ్ఛతా హీ సేవా' ర్యాలీ



చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

శంషాబాద్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మున్సిపాలిటీ అధికారులు గౌతమి కళాశాల, ప్రభుత్వ మైనార్టీ స్కూల్ విద్యార్థులతో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. పచ్చదనం, పరిశుభ్రతలను పాటించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. అనంతరం కళాశాల పరిసరాలతో పాటు పలు ప్రాంతాల్లో శుభ్రత చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పుష్పలతా రెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో 'స్వచ్ఛతా హీ సేవా'

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో శనివారం జేఎన్‌టీయు హైదరాబాద్ ఆదేశాల మేరకు 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని నిర్వహించి, కళాశాల ప్రాంగణం, చుట్టుపక్కల ఉన్న చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాల్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ హరిలీల తదితరులు పాల్గొన్నారు.



ఎంజీఐటీలో 'స్వచ్ఛతా హీ సేవా'లో విద్యార్థులు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల అందజేత





ఇళ్లకు సంబంధించిన పట్టాలు అందజేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా గండిపేట్, రాజేంద్రనగర్ రెవెన్యూ మండలాల్లో మూసీ రివర్ బెడ్ 339 నిర్మాణాలను గుర్తించినట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక వెల్లడించారు. రాజేంద్రనగర్ రెవెన్యూ మండల పరిధిలోని 22 కుటుంబాలకు శనివారం జియగూడ, నార్సింగిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలు, ఇంటి తాళాలను అందజేశామన్నారు. శనివారం రాత్రి రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 2 మండలాల పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతంలో గుర్తించిన ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి వారికి ప్రభుత్వం అందజేస్తున్న డబుల్ బెడ్‌రూమ్, ఇతర సౌకర్యాలను వివరిస్తున్నామన్నారు. స్వచ్ఛందంగా, ఇష్టపూర్వకంగా వచ్చిన వారికి జియగూడ, నార్సింగి ప్రాంతాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను చూపిస్తున్నామన్నారు. 15 కుటుంబాలు జియగూడలో, 7 కుటుంబాలు నార్సింగిలో డబుల్ బెడ్‌రూమ్‌లు కావాలని కోరడంతో వారికి ఆర్డీఓ, తహసీల్దార్ ఆధ్వర్యంలో దస్తావేజులు, ఇంటి తాళాలను అందజేయడం జరిగిందన్నారు. మొత్తం 2 మండలాల పరిధిలో 339 నిర్మాణాలను గుర్తించినట్లు తెలిపారు. అందులో 175 నివాస గృహాలు ఉన్నాయన్నారు. ఈ నివాస గృహాల వారందరి వద్దకు నాలుగు టీమ్‌లు వెళ్లి వారి వివరాలను సేకరిస్తున్నారన్నారు. ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేస్తుందని, అలాగే ఇళ్లు ఖాళీ చేసేందుకు అయ్యే ఖర్చును అందజేస్తుందన్నారు. డబుల్ బెడ్‌రూమ్‌లలో సౌకర్యాలన్నీ ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం నార్సింగి, జియగూడల్లో కేటాయిస్తున్నామని ఇవి పూర్తయిన తర్వాత బాచుపల్లి, కొల్లూరు తదితర వాటిలో కేటాయిస్తామన్నారు. ఎవరూ అపోహలకు గురి కావొద్దని, ఆర్డీఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్‌ల వద్ద తమ సిబ్బందిని కేటాయించామని, అక్కడికి ఎవరూ వెళ్లినా పరిశీలించుకోవచ్చని తెలిపారు.

వారం రోజుల్లో మంచినీటి సమస్య పరిష్కరిస్తాం



ఇబ్బందులను అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్

బండ్లగూడ: మంచినీటి సరఫరా సరిగ్గా లేని కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ అన్నారు. వెంకటేశ్వర నగర్ కాలనీ, విద్యానగర్ ఫేస్ టూ కాలనీ, పరిసర కాలనీలకు మంచినీళ్లు అందించాలని జీఎం మహేందర్ నాయక్, మేనేజర్ శ్రీనివాస్‌ను కోరారు. నీటి సమస్యను వివరిస్తు తమ ప్రాంతంలో పర్యటించాలని జలమండలి అధికారులను కోరడంతో శనివారం కాలనీల్లో పర్యటించారన్నారు. కొన్నాళ్లుగా మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నామని తెలియజేశారు. బైరాగిగూడ, గంధంగూడలో రెండు అతి పెద్ద ట్యాంక్‌లు నిర్మించి మంచినీరు ఇవ్వడానికి ఓపెనింగ్ కూడా చేసి సంవత్సర కాలం గడుస్తున్నప్పటికి నీటిని ఇవ్వకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల్లో మంచినీటి సౌకర్యం కల్పిస్తామని అధికారులు స్థానిక ప్రజలకు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ ప్రెసిడెంట్ కృష్ణసాగర్, రాములు, నాగిరెడ్డి, తిరుపతినాయుడు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా



మైలార్‌దేవ్‌పల్లి: మెగా జాబ్ మేళా ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని మహావీర్ కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 50 ప్రముఖ కంపెనీల వారు ఎంపికైన విద్యార్థులకు జాబ్ కల్పించారు. 1000 మంది విద్యార్థులలో 40శాతం విద్యార్థులు వివిధ కంపెనీలలో ఎంపిక కావడం పట్ల కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సంరెడ్డి విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మారుస్తాం

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



కేశవనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లను దశలవారీగా సీసీరోడ్లుగా మారుస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవనగర్, గొలిదొడ్డిలో రూ.50 లక్షలతో నూతనంగా చేపట్టే సీసీరోడ్డు పనులను శనివారం స్థానికులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత తప్పనిసరి అని అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, భిక్షపతి, శేఖర్, బాలకృష్ణ, హన్మంతు, గణేష్, సుమన్, ప్రసాద్, శ్రీనివాస్, రాజు, గోవింద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 2,798 కేసుల పరిష్కారం

రాజేంద్రనగర్:రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లిలో కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన న్యాయమూర్తులు 2,798 కేసులను పరిష్కరించారు. వీటిలో రాజీ పడిన కేసులు 257, నేరం ఒప్పుకున్నవి 326 కేసులు, బ్యాంక్ చెక్‌లకు సంబంధించిన కేసులు, ట్రాఫిక్ చలాన్లకు సంబంధించినవి 1,904 కేసులు, ఈ–పెట్టీ 74 కేసులు, విద్యుత్ చౌర్యం సంబంధించి 117 కేసులను పరిష్కరించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ సోఫా కాలనీలో త్వరలో పర్యటిస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. గోపన్‌పల్లిలోని సోఫా కాలనీవాసులు శనివారం ఎమ్మెల్యే గాంధీని మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి బస్తీలోని సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోఫా కాలనీలో అసంపూర్తి రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన నీటి సరఫరా అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి ప్రగడ సత్యనారాయణ, వేణుగోపాల్‌రెడ్డి, కాలనీవాసులు గురవయ్య, లాల్సింగ్ నాయక్, కిరాణంరాజు, బుజ్జిబాబు, హరీష్, భద్రు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతా 5కే రన్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఉదయం 6.30గంటలకు స్వచ్ఛతా 5కె రన్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో మేలుహ ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ గౌతమ్, అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్ హాజరవుతున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సిటీ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్



యాకుత్‌పురా: జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం పురానీహవేలీలోని సిటీ సివిల్ కోర్టులో చీఫ్ జడ్జి రేణుకా యారా ఆధ్వర్యంలో పలు కేసులను పరిష్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న 742 కేసులు, 1815 ప్రీ లిటిగేషన్ కేసులతో పాటు మొత్తం 2557 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.44,61,67,924ల నష్టపరిహారాన్ని నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అదనపు చీఫ్ జడ్జీలు డి.వి నాగేశ్వర్‌రావు, డానీ రుత్, భవానీ, సీనియర్ సివిల్ జడ్జీలు పురుషోత్తం రావు, అనిషా, జడ్జీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

చెరువులను శుభ్రంగా ఉంచాలి



నెక్నాంపూర్ చెరువు పరిసరాల్లో క్లీనింగ్ చేస్తున్న ప్రతినిధులు



గండిపేట చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న గోల్కొండ రిసార్ట్ ఉద్యోగులు

మణికొండ: చెరువులలో అనేక జీవరాశులు జీవనం సాగిస్తాయని, చెరువులను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక చౌదరి, గోల్కొండ రిసార్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ చిన్న చెరువు, గండిపేట చెరువుల వద్ద 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా క్లీనింగ్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువుల పరిసరాలలో ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త వేయొద్దన్నారు. ప్రతి నెల చెరువుల వద్ద తమ వంతు కార్యక్రమంగా క్లీనింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఐటీ ఉద్యోగులు, గోల్కొండ రిసార్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభం



పూజల్లో రాహుల్‌దాస్ బాబా, బాలరాజ్

లంగర్‌హౌస్: దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని లంగర్‌హౌస్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోగి బాలరాజ్ అన్నారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద దసరా ఉత్సవ సమితి నూతన కార్యాలయాన్ని శుక్రవారం రాత్రి ప్రారంభించారు. ఇందులో భాగంగా సంగం రాంలీలా మైదానంలో నిర్వహించే దసరా ఉత్సవాల కార్యక్రమాలను సంగం పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ పూజలు ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి శ్రీనివాస్ నిర్వహించగా ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, కృష్ణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు



అత్తాపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చింతల్‌మెట్ చౌరస్తాలో పేరుకుపోయిన వ్యర్థాలను రాజేంద్రనగర్ మున్సిపల్ అధికారులు సిబ్బందితో కలిసి తొలగించారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి



మైలార్‌దేవ్‌పల్లి: భగత్ సింగ్ జయంతి సందర్భంగా శనివారం బాబుల్ రెడ్డినగర్‌లోని బొడ్డురాయి సమీపంలో సనాతన సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విశ్రాంత జీవితం దైవ సన్నిధిలోనే'

గోల్కొండ: సుదీర్ఘకాలం దేవాదాయ శాఖలో ఉద్యోగం చేయడం దేవుడు ఇచ్చిన వరమని సాలర్‌జంగ్ కాలనీ తిరుపల్లిగడ్డలోని శ్రీ కోవెల రంగనాయక స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెలాకరులో పదవీ విరమణ చేయనున్న ఆయనను ఆలయ కమిటీ మాజీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన తన కుటుంబసభ్యులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాదాయ శాఖలో పని చేస్తూ ఎన్నో ఆలయాలకు కార్యనిర్వహణ అధికారిగా సేవలు అందించానన్నారు. శేషజీవితాన్ని కూడా తాను దైవ సేవలోనే గడుపుతానని పేర్కొన్నారు. అశోక్‌కుమార్, సాయిబాబా చారి, సురేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'వైబ్రెంట్ ఫెస్ట్-2024' పోటీల విజేతలు వీరే..

రాయదుర్గం: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక ఆతిథ్య కేంద్రమైన గచ్చిబౌలి నిథమ్‌లో నిర్వహించిన పోటీలు ముగిశాయి. విజేతలను శనివారం ప్రకటించారు. 'టూరిజమ్ అండ్ పీస్' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ పోటీలలో 80 మంది విద్యార్థులు పలు రకాల పోటీలలో పాల్గొని తమ సత్తాను చాటారు. టూరిజంపై క్విజ్ ఆరు థ్రిల్లింగ్ రౌండ్‌లను నిర్వహించారు. ఈ పోటీలో సౌర్యజ్యోతి బక్సీ, కిరణ్‌కుమార్ యాదవ్ విజేతలుగా నిలిచారు. కాగా బీబీఏ విద్యార్థులు సౌమిత్, నిత్య రన్నరప్‌గా నిలిచారు. మరో పోటీలో విజేతగా పవిత్ర, రన్నరప్‌గా ధరణిహ నిలిచింది. టూరిజమ్–పీస్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతగా షీన్, రన్నరప్‌గా ఆద్య నిలిచారు. టాలెంట్‌షోలో అనంత కృష్ణ మృదంగం వాయించి అందరినీ ఆకట్టుకున్నారు. రన్నరప్‌గా భక్తిమోహన్ నిలిచారు.విజేతలను నిథమ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి ఈలాత్రిపాఠి అభినందించారు.

మహాలక్ష్ములను ఆదరించండి



అత్తాపూర్ - 123 పిల్లర్ బస్‌స్టాప్



బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

అత్తాపూర్: మహాలక్ష్మి పథకం విజయవంతమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోంది. ప్రధానంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంది. మహాలక్ష్మి పథకంలో బస్సు ఎక్కే ప్రతి మహిళకు ఎప్పుడో ఒకసారి చేదు అనుభవం ఎదురవుతోంది. ఆర్టీసీ ఉద్యోగుల్లో ఉన్నతాధికారుల హోదాలో ఉన్న వారు మాత్రం మహిళలను ప్రోత్సహిస్తుండగా, ప్రతిరోజు విధినిర్వహణలో ఉంటున్న కొందరు బస్సు కండక్టర్లు, డ్రైవర్లు మహిళలను అగౌరవపరుస్తున్నారు. మరికొందరు డ్రైవర్లు ప్రయాణికులకు అవసరమైన ప్రాంతాల్లో బస్సులను ఆపి ఎక్కించుకుంటూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొంతమంది డ్రైవర్లు ఆర్టీసీ వారు సూచించిన బస్ స్టాప్‌లో కాకుండా రోడ్డు మధ్యలో బస్సును నిలిపివేస్తూ మహిళా ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ స్థితిలో బస్సు ఎక్కాలా? అని ఆగిపోయిన మహిళలకు మరో బస్సు వచ్చే వరకు వేచి ఉండడం వల్ల సకాలంలో వారి పనిప్రదేశాలకు, కార్యాలయాలకు వెళ్లలేకపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు టైమ్‌కు వెళ్లలేకపోతున్నారు. ఉప్పల్, మెహిదీపట్నం రూట్లలో బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఉప్పల్ డిపోకు చెందిన ఉదయం 6 గంటల 45 నిమిషాల నుంచి 7 గంటల వరకు అత్తాపూర్ చౌరస్తా పీవీ నరసింహారావు ఎలివేటెడ్స్ ఎక్స్‌ప్రెస్‌వేలో పిల్లర్ నంబర్ 123 ఉన్న బస్‌స్టాప్‌లో కాకుండా రోడ్డు మధ్యలో బస్సులను ఆపుతూ మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు కల్గిస్తున్నారు. ఈ క్రమంలో బస్సు ఎక్కి, దిగేటప్పుడు అటు నుంచి వెళ్లే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. మహాలక్ష్మి పథకం సద్వినియోగం చేసుకుంటున్న ప్రతి మహిళలతో ఆర్టీసీ సిబ్బంది ప్రవర్తన మర్యాదగా ఉండేలా చూడాలని మహిళా ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు కోరుతున్నారు.

ముగిసిన కబడ్డీ–ఖోఖో టోర్నీ



ట్రోఫీతో చాంద్రాయణగుట్ట జీహెచ్ఎస్ జట్టు

చాంద్రాయణగుట్ట: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ మండల స్థాయి టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. శంషీర్‌గంజ్‌లోని శారద విద్యాలయలో జరిగిన బండ్లగూడ మండల జోన్ స్థాయి సెలక్షన్స్ టోర్నమెంట్‌లో కబడ్డీ విభాగం అండర్–17 బాలికల విభాగంలో జీహెచ్ఎస్ విన్నర్‌గా నిలవగా, శారద విద్యాలయ రన్నర్‌గా, అండర్–17 బాయ్స్‌లో కేబక్యూ బార్కాస్ విజేతగా, టీఎంఆర్ఐఈఎస్ చార్మినార్ రన్నర్‌గా నిలిచాయి. అండర్–14 గరల్స్ విభాగంలో విజ్ఞాన భారతి విజేతగా, ఫలక్‌నుమా టీజీఎస్‌డబ్ల్యూఆర్ రన్నర్‌గా, బాయ్స్ విభాగంలో జీహెచ్ఎస్ చాంద్రాయణగుట్ట విజేతగా, ద్వితీయ స్థానంలో జీహెచ్ఎస్ జంగమ్మెట్ టీమ్‌లు నిలిచాయి. ఇక ఖోఖో అండర్–14 బాలికల విభాగంలో ఫలక్‌నుమా టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఫలక్‌నుమా విజేతగా, జీహెచ్ఎస్ పయనీర్ బజార్ ద్వితీయ స్థానంలో, అండర్–17 గరల్స్‌లో ఫలక్‌నుమా టీఎంఆర్ఐఈఎస్ విన్నర్‌గా, బార్కాస్ టీఎంఆర్ఐఈఎస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్–14 బాయ్స్‌లో చాంద్రాయణగుట్ట టీఎంఆర్ఐఈఎస్ విన్నర్‌గా, బీసీ వెల్ఫేర్ ద్వితీయ స్థానంలో, అండర్–17 బాయ్స్‌లో బీసీ వెల్ఫేర్ ప్రథమ స్థానంలో, చార్మినార్ టీఎంఆర్ఐఈఎస్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. టోర్నమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి వి.శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ఈ పోటీలు విజయవంతంగా ముగిశాయి.

రెహమాన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధక విద్యార్థి అసదుర్ రెహమాన్‌కు శనివారం పీహెచ్‌డీని ప్రకటించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అహ్మద్‌రజా పర్యవేక్షణలో 'జమ్ముకశ్మీర్‌లో చైల్డ్ వెల్ఫేర్ అడ్మినిస్ట్రేషన్ స్థితి: పూంచ్ జిల్లా యొక్క కేస్ స్టడీ' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించగా పీహెచ్‌డీని ప్రకటించారు.